

చెర్వుగట్టు జాతరకు వేళాయే..
చెర్వుగట్టు పార్వతీ జడలరామలింగేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. - IIలో



వ్యతిరేకంగా మాట్లాడలేదు
ఏ వర్గానికీ తాను వ్యతిరేకంగా మాట్లాడకున్నా తనపై ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే వివేక్ అన్నారు. - IIలో



'ఫ్యాషన్' విద్యార్థుల సందడి
హైదరాబాద్‌లోని లకోటియా కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్స్ విద్యార్థులు శనివారం పోచంపల్లిని సందర్శించారు. - IIలో

వేతన జీవులకు ఊరట

- రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు
- ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం
- మిగతా రంగాల్లో ప్రయోజనం అంతంతే..
- సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు అందనున్న ప్రోత్సాహకాలు
- రైల్వే లైన్ల విషయంలో స్పష్టత కరువు





సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు ఊరట కలిగించింది. దీంతో సంవత్సరానికి రూ.12.75 లక్షల వరకు ఆదాయం ఉన్నవారు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. పాఠశాలలు, పీహెచ్‌సీల్లో ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. స్టార్టప్‌లకు రూ.5లక్షల క్రెడిట్ కార్డులు అందించనున్నారు. పత్తి దిగుబడి పెంచేలా చర్యలు తీసుకుంటామని బడ్జెట్‌లో పేర్కొంది. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచించారు. దేశవ్యాప్తంగా ఏడాదికి 10వేల మెడికల్ సీట్లు పెంచుతామని కేంద్ర ప్రకటించింది. రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

కిసాన్ క్రెడిట్ కార్డుతో 5.46 లక్షల మందికి మేలు



రైతులకు ఇచ్చే కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచింది. దీంతో జిల్లాలోని సుమారు 5.46 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూనుంది. పండ్లు, కూరగాయల ఉత్పత్తికి నూతన పథకాన్ని అమలు చేయనుంది. అధికోత్పత్తి వంగడాల కోసం ప్రత్యేక జాతీయ మిషన్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు




ఇన్వెస్టింగ్ ఇన్ పీపుల్ మిషన్ కింద రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయబోతున్నారు. జిల్లాలో కూడా ఈ ల్యాబ్‌లు ఏర్పడితే వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. భారత్ నెట్ ప్రాజెక్టు కింద ఇంటర్నెట్ సేవలను అమల్లోకి తేనుంది. దీంతో జిల్లాలో 240 హైస్కూళ్లు, 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. సాక్ష్యం అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0 కింద అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో జిల్లాలోని 904 కేంద్రాలకు ప్రయోజనం చేకూరనుంది.

70 శాతం మందికిపైగా పన్ను మినహాయింపు



జిల్లాలో మొత్తం 12 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు ఉంటే, 6 వేల మంది పన్ను చెల్లించే వారున్నారు. 14,700 మంది ఉద్యోగులు ఉండగా 8,650 మందికి పైగా ఆదాయ పన్ను పరిధిలోకి వస్తున్నారు. వారిలో 70 శాతం మందితోపాటు, మిగిలిన వారందరికీ మేలు జరగనుంది. అద్దెలపై విధించే టీడీఎస్ వార్షిక పరిమితిని రూ.2.04 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచగా, పెన్షన్ల వడ్డీపై టీడీఎస్, టీటీఎస్ మినహాయింపును ప్రస్తుతం ఉన్న రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచింది. దీంతో జిల్లాలోని పెన్షనర్లకు, భవన యజమానులకు మేలు చేకూరనుంది.

రైల్వే ప్రాజెక్టులపై రాని స్పష్టత




ఇక జిల్లాకు ఎలాంటి రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్న విషయంపై కేంద్ర బడ్జెట్‌లో స్పష్టత లేదు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. రాష్ట్రాల వారీగా కేటాయింపులతో కూడిన పింక్ బుక్‌ను రైల్వే బోర్డు విడుదల చేశాక దీనిపై స్పష్టత రానున్నట్టు తెలుస్తోంది.

కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకం



సూక్ష్మ తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి ఉడాన్ పోర్టల్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి రూ.5 లక్షల క్రెడిట్ కార్డులు అందిస్తామని ఆర్థిక శాఖ మంత్రి పేర్కొన్నారు. కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు రూ.5 లక్షల వరకు ఇవ్వనుంది. వచ్చే ఐదేళ్లలో దానిని రూ.2 కోట్ల వరకు పెంచనుంది. దీంతో జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు చేయూత అందనుంది.

ఉపాధి హామీకి భరోసా



ఉపాధి హామీ పథకానికి గత ఏడాదిలాగే ఈసారి రూ.86 వేల కోట్లు కేటాయించడంతో నల్లగొండ జిల్లాలో దాదాపు 4 లక్షల కుటుంబాలకు మేలు జరగనుంది. సూర్యాపేట జిల్లాలో 2.72 లక్షల కుటుంబాలకు చెందిన 6.32 లక్షల మంది కూలీలకు పని దొరికే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ మెటీరియల్ కాంపొనెంట్ కింద చేపట్టే పనులకు నిధులు సమకూరే అవకాశం ఉంది.

పెరగనున్న మెడికల్ సీట్లు



వచ్చే ఐదు సంవత్సరాల్లో 75 వేల మెడికల్ సీట్లను పెంచుతామని, అందులో ఈ ఏడాది కాలంలో 10 వేల సీట్లు పెంచుతామని కేంద్రం ప్రకటించింది. దీంతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని మెడికల్ కాలేజీల్లో ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా సీట్లు పెరిగే అవకాశం ఉంది.

పత్తి దిగుబడి పెరిగేలా..



అధిక పత్తి ఉత్పత్తి, వంగడాల అభివృద్ధికి చర్యలు చేపడతామని కేంద్రం ప్రకటించింది. జిల్లాలో దాదాపు 6 లక్షల ఎకరాల్లో రైతులు వానాకాలంలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలను అభివృద్ధి చేయడం ద్వారా జిల్లాలో పత్తి దిగుబడి పెరిగి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

ప్రజలకు ఊరటనిచ్చే బడ్జెట్



ఈ బడ్జెట్ మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులకు ఊరట కల్పించేది. కొత్త ట్యాక్స్ విధానంలో రూ.12.75 లక్షల ఆదాయం వరకు పన్ను లేకుండా చేయడం ఎంతో ఊరట. కిసాన్ క్రెడిట్ లిమిట్‌ను రూ.5 లక్షలకు పెంచడం, వంద జిల్లాల్లో ధన రాశి యోజన కింద కంది, మినప పంటల ఉత్పత్తి పెంచడానికి రైతులకు ప్రోత్సాహం ఇవ్వడం ఎంతో ఉపయోగం. స్టార్టప్ కంపెనీలకు రూ.20 కోట్ల వరకు బ్యాంకు గ్యారెంటీ లేకుండా లోన్లు ఇవ్వడం మంచి పరిణామం. ఇప్పటివరకు గుర్తింపు లేని గిగ్ వర్కర్లకు (స్విగ్గీ, జొమాటలో పనిచేసే వారికి) గుర్తింపు లభించనుంది.వీధివ్యాపారులకు వడ్డీలేని రుణాలు అందనున్నాయి.
– ప్రొఫెసర్ అంజిరెడ్డి, ఎంజీయూ, ఎకనామిక్స్ విభాగాధిపతి

కేంద్ర బడ్జెట్‌తో మధ్యతరగతికి మేలు



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ మధ్య తరగతి వర్గానికి ఎంతో ఊరటను కలిగించేదిగా ఉంది. ఆదాయం రూ.12 లక్షలు దాటితే, రూ.4 లక్షల వరకే పన్ను ఉండదు. వాస్తవానికి ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోనికి తీసుకొంటే ఈ పరిమితిని కనీసం రూ.7 లక్షలకు పెంచితే బాగుండేది. బడ్జెట్ కేటాయింపులు మిగతా రంగాలకు ఎలా ఉన్నా, మానవ వనరులను పెంపొందించే విద్యా, వైద్యం కేటాయింపులు పరిశీలిస్తే వీటిపై సవితి తల్లి ప్రేమ చూపినట్లుగా ఉంది. మొత్తం బడ్జెట్ 50,65,345 కోట్లలో విద్యకు కేవలం 1,28,650 అంటే 2.54%, ఆరోగ్యానికి 98,311 కోట్లు అంటే 1.94% కేటాయించడం, కోఠారి కమిషన్ సిఫార్సులను పట్టించుకోక పోవడమే అన్యాయమే.
– అక్కెనపల్లి మీనయ్య, ఆర్థిక నిపుణుడు

బడ్జెట్‌లో తెలంగాణ ప్రస్తావన లేదు



కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా కాదు తెలంగాణకు సంబంధించి కూడా ఏమీ ప్రస్తావించలేదు. విభజన హామీలను పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఎలాంటి కేటాయింపులు చేయలేదు. రూ.12 లక్షల ఆదాయం ఉన్న వారికి పన్ను ఊరట అని చెప్పి మళ్లీ రూ.4 లక్షల స్లాబ్ అంటూ మెలికపెట్టారు. పేదలు, మహిళలు, రైతులు, నిరుద్యోగుల గురించి మట్లాడే బీజేపీ వారిని పూర్తిగా వదిలేసింది. ఉద్యోగాల ఊసే లేదు. కొత్త పరిశ్రమలకు రాయితీలు లేవు. స్కిల్ డెవలప్‌మెంట్‌ను పట్టించుకోలేదు. ఉపాధి హామీలో నిధుల పెంపు లేదు. గత బడ్జెట్‌లో ఎన్ని చేశారనేది చెప్పకుండా.. ఏదో చేశామని చెప్పుకొచ్చారు.
– చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ

క్యాన్సర్ బాధితులకు డే కేర్ సెంటర్



నల్లగొండ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డేకేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. క్యాన్సర్ భూతాన్ని ముందుగా గుర్తించి సరైన సమయంలో చికిత్స అందించకపోవడంతో అనేక మంది మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో డేకేర్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించారు. జిల్లాలో ఇప్పటికే సుమారు 1,509 మంది వివిధ రకాల క్యాన్సర్ బాధితులు హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. డేకేర్ క్యాన్సర్ సెంటర్ల ఏర్పాటు వల్ల ముందుగానే వివిధ రకాల క్యాన్సర్లను గుర్తించి చికిత్స అందించి మరణాలను తగ్గించనున్నారు. ఈ సెంటర్లకు క్యాన్సర్ నిర్ధారణకు అవసరమైన పరికరాలు సమకూర్చి స్క్రీనింగ్ చేయనున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే క్యాన్సర్ అనుమానితులకు ఈ సెంటర్ పరీక్షలు చేయనున్నారు. దీనివల్ల క్యాన్సర్ బాధితులకు, జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేకూరనుంది.

న్యూస్‌రీల్

99 మంది బాలకార్మికులకు విముక్తి

నల్లగొండ: ఆపరేషన్ స్మైల్ 11వ విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 99 మంది బాల కార్మికులకు (88 మంది బాలురు, 11 మంది బాలికలు) విముక్తి కల్పించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్–11 కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా చేపట్టామని పేర్కొన్నారు. చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 61 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసామని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకున్నట్లు ఎవరికైనా తెలిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ల స్వీకరణ

నల్లగొండ టూటౌన్ : బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి కోసం నాయకుల నుంచి ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం నామినేషన్లు స్వీకరించింది. పార్టీ జిల్లా ఎన్నికల పరిశీలకుడు కట్టా సుధాకర్‌రెడ్డి శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయానికి వచ్చి పార్టీ జిల్లా ముఖ్య నాయకులతో సమావేశయ్యారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్ష పదవి ఆశిస్తున్న వారు నామినేషన్లు సమర్పించాలని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ఉమ్మడి జిల్లాలో వివిధ సామాజిక వర్గాలను పరిగణలోకి తీసుకొని ఇక్కడ జిల్లా అధ్యక్షుడిని నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, సీనియర్ నేత, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వడపోతల అనంతరం పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదివారం జిల్లా అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. అయితే.. ముఖ్య నాయకులంతా ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిస్తోంది.

నీలగిరికి నూతన మాస్టర్‌ప్లాన్

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణం మాస్టర్ ప్లాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నీలగిరి మున్సిపాలిటీలో ఇకనుంచి కొత్త మాస్టర్ ప్లాన్ అమల్లోకి వచ్చింది. దాదాపు పది సంవత్సరాల నుంచి కొనసాగిన మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ కొద్ది నెలల క్రితం మున్సిపల్ యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన విషయం తెలిసిందే. మున్సిపల్ యంత్రాంగం పంపించిన మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం తెలుపుతూ రెండు రోజుల క్రితమే జీఓ విడుదల చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీఓ శనివారం మున్సిపాలిటీకి చేరింది. పాత పట్టణంతో పాటు విలీనమైన ఏడు గ్రామ పంచాయతీల రెవెన్యూ పరిధిని కలుపుకొని మాస్టర్ ప్లాన్ తయారు చేశారు. కొత్తగా తయారుచేసిన మాస్టర్ ప్లాన్ 2041 వరకు కొనసాగనుంది. కాగా గతంలో ఉన్న గ్రీన్ బెల్ట్, పరిశ్రమల ప్రాంతం కమర్షియల్ జోన్.. పూర్తిగా మారాయి. దీనికి సంబంధించిన గెజిట్ వస్తే పూర్తి వివరాలు సమగ్రంగా తెలుస్తాయి.

బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి



మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

భూదాన్‌పోచంపల్లి : కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి చూపిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి పేర్కొన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా మహాసభల్లో భాగంగా రెండో రోజు శనివారం ఏర్పాటుచేసిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. కొఠారి కమిషన్ ప్రకారం విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో సంస్కరణల పేరుతో కేంద్రం యూజీసీ ముసాయిదా తీసుకొస్తుంద, ఈ విధానం వల్ల వర్సిటీల్లో వీసీలను ఎంపిక చేసుకునే అధికారాన్ని రాష్ట్రాలు కోల్పోతాయన్నారు. యూజీసీ ముసాయిదాను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, రాష్ట్ర కార్యదర్శి దామెర కిరణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు, రాష్ట్రకమిటీ సభ్యులు కుక్కట్ల శివానీ, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్, వనం రాజు, బుర్రు అనిల్, రాంచంద్రారెడ్డి, పగిళ్ల లింగారెడ్డి, గూడూరు అంజిరెడ్డి, మంచాల మధు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులకు మోక్షం

- ఇన్‌లెట్ టీబీఎం ట్రయల్‌రన్ విజయవంతం



చందంపేట : శ్రీశైలం సొరంగ మార్గం ఇన్‌లెట్ నుంచి సొరంగం పనులకు మోక్షం కలగనుంది. బురద, నీరు, ఇతరాత్ర కారణాలతో మూడేళ్లుగా నిలిచిపోయిన పనులు మూడు రోజుల్లో తిరిగి ప్రారంభం కానున్నాయి. ఇన్‌లెట్‌లో బురద, నీరు తగ్గడం, టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్) ట్రయల్ రన్ విజయవంతం కావడంతో మిగిలిన పనులు పూర్తిచేసే దిశగా అధికారులు సిద్ధమయ్యారు.

9.5 కిలోమీటర్ల మేర పెండింగ్

శ్రీశైలం ఎడమగట్టు కాల్వలో భాగంగా దోమలపెంట నుంచి నక్కలగండి ప్రాజెక్టు మన్నెవారిపల్లి వరకు 44.5 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు ఇన్‌లెట్‌లో 14 కిలోమీటర్లు, ఔట్‌లెట్‌లో 21 కిలోమీటర్ల సొరంగం పూర్తయింది. ఇంకా 9.5 కిలోమీటర్ల మేర పెండింగ్‌లో ఉంది. ఇన్‌లెట్‌లో నీరు చేరడం, బురద పేరుకు పోవడంతో పనులు చేపట్టేందుకు సాధ్యపడలేదు. దీనికి తోడు నిధులు కేటాయింపు కూడా లేకపోవడంతో మూడు సంవత్సరాల పాటు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఇన్‌లెట్‌లో టీబీఎం ట్రయల్ రన్ విజయవంతం కావడంతో మూడు రోజుల్లో పనులు ప్రారంభించి వేగంగా పూర్తి చేసేలా అధికారులు సిద్ధమవుతున్నారు. మరోవైపు నుంచి ఔట్‌లెట్ పనులు చేపట్టాల్సి మిషన్‌కు సంబంధించిన బేరింగ్ రెండు మూడు రోజుల్లో చెన్నైకి చేరనుంది. అక్కడి నుంచి భారీ వాహనంలో మన్నెవారిపల్లె వద్దనున్న ఔట్‌లెట్ వరకు తరలించనున్నారు. అంతా సవ్యంగా సాగితే ఈ నెలలోనే ఔట్‌లెట్ నుంచి కూడా పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది.


ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరగాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆమె అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి తుది ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియ పక్కాగా నిర్వహించాలన్నారు. అంతకుముందు కలెక్టర్.. ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆర్జాలబావిలో గల వేర్ హౌసింగ్ గోదాము, గోదాము మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం డీపీఓ వెంకయ్య, డీఎంఓ శ్రవణ్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచిన పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను పరిశీలించి మాట్లాడారు. మార్చి 3న ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపును ఆర్జాలబావి వద్ద ఉన్న వేర్ హౌసింగ్ గోదాములో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్జాలబావిలో గల వేర్ హౌసింగ్ గోదాము వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నేడు పెద్దగట్టులో దిష్టిపూజ

- కేసారం చేరిన దేవరపెట్టె
- నేటి అర్ధరాత్రి వరకు లింగమంతుల స్వామి ఆలయానికి.. అనంతరం గుట్టచుట్టూ బలిహారణ
- 16 నుంచి 20 వరకు జాతర
- నిర్వహణకు రూ.5కోట్ల నిధులు



సూర్యాపేటలో దేవరపెట్టెకు స్వాగతం పలుకుతున్న భక్తులు, యాదవ సంఘం నాయకులు

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీ లింగమంతుల స్వామి (పెద్ద గట్టు) జాతర ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు జరగనుంది. ఈనేపథ్యంలో ఆదివారం దిష్టి పూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. దేవతామూర్తులతో ఉన్న దేవరపెట్టెను మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం చీకటాయపాలెం గ్రామం నుంచి సూర్యాపేట మండలం కేసారం గ్రామానికి శనివారం రాత్రి తీసుకొచ్చారు. ఆదివారం ఇక్కడే దేవతకు బైకానులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అదే రోజు దేవరపెట్టెను గజ్జెల లాగులు, భేరీ చప్పుళ్ల మధ్య ఓలింగా.. ఓలింగా నామస్మరణతో ఊరేగింపుగా మెంతబోయిన, తండ, మట్ట వంశీయుల సమక్షంలో కేసారం నుంచి 9 కిమీ దూరంలో ఉన్న పెద్దగట్టుకు అర్ధరాత్రి వరకు చేరుస్తారు. అయితే 15 రోజుల తర్వాత జరగనున్న లింగమంతుల స్వామి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను దిష్టి పూజ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రోజునే తల్లి పిల్ల గొర్రెను స్వామి వారికి బలిస్తారు. అనంతరం భక్తులు తీసుకుచ్చిన నైవేద్యంతో రక్తంను కలిపి గుట్ట చుట్టూ బలిహరణ కార్యక్రమం నిర్వహిస్తారు. బలిచ్చిన తల్లి పిల్ల గొర్రె మాసంతో సోమవారం ఆహారం వండి భక్తులకు వడ్డించనున్నారు. దీంతో దిష్టి పూజ కార్యక్రమం ముగిసినట్లుగా ప్రకటిస్తారు. అనంతరం సాయంత్రం దేవర పెట్టెను తిరిగి కేసారం గ్రామానికి తరలిస్తారు. జాతర ప్రారంభం రోజున మళ్లీ దేవరపెట్టెను పెద్దగట్టుకు ఊరేగింపుగా తీసుకువస్తారు.

భారీ పోలీస్ బందోబస్తు

పెద్దగట్టు జాతర దిష్టి పూజ నేపథ్యంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్నుట్టు ఎస్ఐ వి.మహేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, 11మంది ఎస్ఐలు, 100మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిసున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో దిష్టి పూజ కార్యక్రమం జరుపుకోవాలని సూచించారు.



దేవరపెట్టెలోని విగ్రహాలు

పెద్దగట్టు జాతరకు రూ.5కోట్లు మంజూరు

తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు రూ.5కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, శాశ్వత ప్రాతిపాదికన మరుగుదొడ్లు, గుట్టపైకి దారితో పాటు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత జాతరల కంటే ఈ సారి నిధులు ఎక్కువగా కేటాయించినట్లు తెలిపారు. జాతర నిర్వహణ పట్ల ప్రత్యేక చొరవ చూపించి నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దేవరపెట్టెకు ఘన స్వాగతం

సూర్యాపేటటౌన్ : చీకటాయపాలెం నుంచి కేసారం గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దేవరపెట్టెకు సూర్యాపేటలో శనివారం రాత్రి పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, పెద్దగట్టు ఆలయ కమిటీ చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం యాదవ పూజారులు డప్పు వాయిద్యాలు, భేరీల మోతలతో నృత్యాలు చేస్తూ యాత్రగా కేసారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో యాదవ వంశస్తులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నృసింహుడి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు నేత్రపర్వంగా చేపట్టారు. వేకువజామునే ఆలయాన్ని తెరచిన అర్చకులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేస, తులసీ దళాలతో అర్చించారు. అదే విధంగా ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు.







చెర్వుగట్టు జాతరకు వేళాయె

- 4 నుంచి 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు
- 5వ తేదీ తెల్లవారుజామున రామలింగేశ్వరుడి కల్యాణం
- ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయశాఖ


గర్భగుడిలో కొలువైన రామలింగేశ్వరుడు

నార్కట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ ఉత్సవాలకు చెర్వుగట్టు ముస్తాబవుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

5వ తేదీ కల్యాణం

ఈ నెల 4వ తేదీ ఉదయం ఆలయంలోని ప్రధాన మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 5వ తేదీ తెల్లవారుజామున స్వామివారి కల్యాణం, 6వ తేదీ తెల్లవారుజామున అగ్నిగుండాలు, 7వ తేదీ తెల్లవారుజామున దోపోత్సవం, సాయంత్రం ఏకాంతసేవ, 8వ తేదీ ఉదయం రుద్రాభిషేకం, ఏకాంతసేవ, 9వ తేదీ సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.


లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది

కల్యాణోత్సవం టికెట్ రూ.1000

స్వామివారి కల్యాణంలో పాల్గొనాలనుకునే భక్తులకు టికెట్ ధర రూ.1000గా ఆలయ అధికారులు నిర్ణయించారు. 300 మందికి మాత్రమే టికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏడు రోజుల పాటు గట్టు పైకి వెళ్లే వాహనాలకు టోల్ నిర్వాహకులు టోల్ చార్జీలు వసూలు చేయవద్దని ఆలయ అధికారులు సూచించారు. అదే విధంగా గట్టు పైన మూడు గుండ్ల పైకి 4, 5 తేదీల్లో భక్తులు అనుమతించట్లేదని తెలిపారు.

రెండు లక్షల లడ్డూలు తయారీ

బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం దాదాపు రెండు లక్షల లడ్డూలు తయారీ చేయించడంతో పాటు ప్రసాదం విక్రయించేందుకు పది కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు నగరోత్సవం

చెర్వుగట్టు వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నగరోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఆదివారం సాయంత్రం నల్లగొండ పట్టణంలోని రామాలయం వద్ద నగరోత్సవం ప్రారంభించి హైదరాబాద్ రోడ్డులోని వీటీ కాలనీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పలువురు అధికారులతో కలసి చెర్వుగట్టును సందర్శించారు. గట్టు పైన, కింద వివిధ ప్రదేశాలతో పాటు కల్యాణ మండపం, కోనేరు, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బల్క్ వాటర్ సరఫరా చేయాలని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తగినంత సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేయాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ శివరాంరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్డీఓ యాణాల అశోక్‌రెడ్డి, సీఐ నాగరాజు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర రావు, ఎంపీడీఓ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ్‌కుమార్, ఆర్ఐ తరుణ్ ఉన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం



బ్రహ్మోత్సవాల కోసం చెర్వుగట్టు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. నల్లగొండ ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి ప్రత్యేక పరిశీలనలో పనులు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల గురించి ప్రజలకు తెలియజేయడానికి కరపత్రాలు పంచడంతో పాటు వాహనాల ద్వారా ప్రచారం చేయిస్తున్నాం. ప్రత్యేక సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం.

– సిరికొండ నవీన్‌కుమార్, ఈఓ

అగ్నిగుండాలు ప్రత్యేకం



ప్రతి నెల అమావాస్య రోజు తెలంగాణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చెర్వుగట్టు ఆలయానికి వస్తుంటారు. అమావ్యాస రోజు రాత్రి ఆలయ ఆవరణలో నిద్రిస్తే అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. బ్రహ్మోత్సవాల్లో అగ్నిగుండాలు ఎంతో ప్రత్యేకం. భక్తులు అగ్నిగుండాల్లో నడవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

– పోతులపాటి రామలింగేశ్వరశర్మ, దేవాలయ ప్రధాన అర్చకుడు

టాటా ఏస్ వాహనం బోల్తా


రోడ్డుపై పడిన పెయింట్ డబ్బాలు

బీబీనగర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు పెయింటింగ్ డబ్బాల లోడ్‌తో వెళ్తున్న టాటా ఏస్ వాహనం శనివారం బోల్తా పడింది. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.







పోచంపల్లిలో ఫ్యాషన్ డిజైన్ విద్యార్థులు


రంగులద్దే విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్‌లోని లకోటియా కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్స్ కాలేజీకి చెందిన 90 మంది విద్యార్థులు శనివారం పోచంపల్లిని సందర్శించారు. ఫ్యాషన్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ఫ్యాషన్ ఫొటోగ్రఫీ డిజైనింగ్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు స్టడీటూర్‌లో భాగంగా కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, టూరిజం పార్కు, చేనేత గృహాలను సందర్శించారు. కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌లో వస్త్రాలు ఎలా తయారవుతాయో ప్రత్యక్షంగా చూశారు. ఇక్కత్ అంటే ఏమిటి, అనుసరిస్తున్న డిజైన్లు, వస్త్రాల నాణ్యతను పరిశీలించి చేనేత కళాకారుల నైపుణ్యాలను కొనియాడారు. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు నేటి ఫ్యాషన్ రంగానికి, ఇంటీరియర్‌కు ఎంతో అనువుగా ఉంటాయని విద్యార్థులు కొనియాడారు. వీరికి కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ నిర్వాహకుడు సాయిని భరత్ గైడ్ చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మహ్మద్ అజహరుద్దీన్ ముజాహిద్, మేనేజింగ్ డైరెక్టర్ ఆఫన్ ముజాహిద్, డైరెక్టర్ గుఫ్రాన్ ముజాహిద్దీన్, సెంట్రల్ మేనేజర్ భానుప్రియ, హెచ్‌ఓడీ ఫ్యాషన్స్ రుక్సానా, ఫ్యాకల్టీ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

దళితుల్లో ఏ వర్గానికీ వ్యతిరేకంగా మాట్లాడలేదు

- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి
- సూర్యాపేటలో వడ్లకొండ కృష్ణ కుటుంబానికి పరామర్శ


కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మాలమహానాడు నాయకులు

సూర్యాపేటటౌన్: దళితుల్లో ఏ వర్గానికీ తాను వ్యతిరేకంగా మాట్లాడలేదని, కేవలం పబ్లిసిటీ కోసమే మంద కృష్ణ మాదిగ తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆయన శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులను వివేక్ వెంకటస్వామి కుటుంబం పరోక్షంగా వెనకుండి నడిపించిందన్న మంద కృష్ణమాదిగ ఆరోపణలపై వివేక్ వెంకటస్వామి స్పందిస్తూ.. మాల, మాదిగలది పొలిటికల్ గొడవని, మంద కృష్ణమాదిగ వెనకాల ఏ పార్టీ ఉందో అందరికీ తెలుసని, వాళ్ళు ఆడిపిస్తున్నట్లు మందకృష్ణ మాదిగ ఆడుతున్నారని అన్నారు. ప్రజల్లో ఆదరణ లేని మంద కృష్ణమాదిగ మూడుసార్లు ఎన్నికల్లో పోటీచేస్తే డిపాజిట్ కూడా రాలేదని విమర్శించారు. తెలంగాణలో జనాభా పరంగా రెండో స్థానంలో ఉన్న మాలలను చిన్నచూపు చూస్తున్నారనే పోరాటం చేస్తున్నామే తప్ప.. ఎస్సీ రిజర్వేషన్ అడ్డుకోవడం కోసం కాదని, దీనిపై మాల సింహగర్జనలో స్పష్టంగా చెప్పామన్నారు. మాల, మాదిగలను విభజించి పాలించాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సూర్యాపేటలో ఇటీవల పరువు హత్యకు గురైన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కోరారు. శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి సూర్యాపేటలోని మాల బంటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుల దురహంకార హత్యలపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి హంతకులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై జిల్లా ఎస్పీతో వివేక్ వెంకటస్వామి మాట్లాడి నిందితులను శిక్షించాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వడ్లకొండ కృష్ణ హత్య దారుణమని, దీనిపై నేషనల్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తల్లమళ్ళ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు వేణు బలరాం, నాయకులు బొల్లెద్దు దశరథ, రవి, కట్ట సైదులు, కట్ట మురళి, అఖిల్, నరేందర్ పాల్గొన్నారు.



